క్లుప్తంగా

ప్రజలకు మెరుగైన సేవలు అందించాలి



రావులపాలెం మండల పరిషత్ కార్యాలయంతో అభివృద్ధి పథకాల వివరాలు పరిశీలిస్తున్న డీఎల్‌డీఓ ప్రభాకరరావు

రావులపాలెం: ప్రజలకు మెరుగైన సేవలు అందించడానికి మండల స్థాయి అధికారులు సచివాలయ సిబ్బందితో సమన్వయంగా పని చేయాలని డీఎల్‌డీఓ ఎం.ప్రభాకరరావు సూచించారు. శనివారం ఆయన రావులపాలెం ఎంపీడీఓ కార్యాలయాన్ని తనిఖీ చేశారు. మండలంలో జరుగుతున్న వివిధ అభివృద్ధి పథకాలు, సంక్షేమ పథకాల అమలు తదితర అంశాలపై వివరాలు అడిగి తెలుసుకున్నారు. సచివాలయ భవనాలు, వెల్నెస్ సెంటర్లు, ఆర్‌బీకే నిర్మాణాలు త్వరితగతిన పూర్తి చేయాలని సూచించారు. కార్యక్రమంలో ఎంపీడీఓ రాజేంద్రప్రసాద్, ఈఓపీఆర్‌డీ కృష్ణ ఉన్నారు.

కిక్కిరిసిన వేంకటేశ్వరుని ఆలయం

అయినవిల్లి: మండలంలోని నల్లచెరువులో కొలువైన వేంకటేశ్వరస్వామి ఆలయం శనివారం భక్తులతో కిక్కిరిసింది. స్వామికి ఆలయ ప్రధానార్చకుడు చక్రవర్తుల విజయ్‌కుమార్ ఆధ్వర్యంలో విశేషాభిషేకాలు, ప్రత్యేక పూజలు జరిపారు. స్వామిని అధిక సంఖ్యలో భక్తులు దర్శించి ప్రత్యేక పూజలు నిర్వహించారు. స్వామికి కానుకలు, మొక్కులు చెల్లించారు. చిన్నారులకు తులాభారం నిర్వహించారు. అధిక సంఖ్యలో భక్తులు స్వామి అన్నప్రసాదం స్వీకరించారు. అలాగే అయినవిల్లి విఘ్నేశ్వరుని ఆలయం కూడా భక్తులు పోటెత్తారు.

కొబ్బరి కార్మికులు ఇన్సూరెన్స్ చేయించుకోవాలి

అంబాజీపేట: మండలంలో ఉన్న ప్రతి కొబ్బరి కార్మికుడు ఇన్సూరెన్స్ చేయించుకోవడం వల్ల కుటుంబానికి ఆసరాగా ఉంటుందని వలుపు కార్మికుల రాష్ట్ర అధ్యక్షుడు బొడ్డపల్లి నాగేశ్వరరావు అన్నారు. ముక్కామలలో కొబ్బరి వలుపు కార్మిక సంఘ అధ్యక్షుడు బొక్కా వెంకటేశ్వరరావు అధ్యక్షతన కొబ్బరి వలుపు కార్మిక సంఘ సమావేశం శనివారం జరిగింది. ఆయన మాట్లాడుతూ కొబ్బరి అభివృద్ధి బోర్డు ద్వారా ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర కొబ్బరి కార్మికులకు కేరా సురక్ష ఇన్సూరెన్స్ ఏర్పాటు చేసిందన్నారు. ప్రతి కొబ్బరి వలుపు కార్మికుడు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలన్నారు. సమావేశంలో మారే చంద్రరావు, నాగాబత్తుల ప్రకాశం, జంగా నాగేశ్వరరావు, జోగి ఏడుకొండలు, సబ్బితి సత్తిబాబు తదితరులు పాల్గొన్నారు.

చిన్నారులకు టీకాలు



సంధిపూడిలో చిన్నారులకు టీకాలు అందజేస్తున్న ఆరోగ్య సిబ్బంది

ఆలమూరు: మండలం పరిధిలోని పెదపళ్ల, చొప్పెల్ల పీహెచ్‌సీల గ్రామ సచివాలయాల పరిధిలో ఆరోగ్య సిబ్బంది శనివారం చిన్నారులకు టీకాలు అందజేశారు. వైద్యాధికారులు, పి.భవానీశంకర్, డి.మల్లికార్జున ఆధ్వర్యంలో ఆలమూరు-2, కలవచర్ల, పినపళ్ల, సంధిపూడి, జొన్నాడ శివారు మూలాటి రేవు, చొప్పెల్ల, మోదుకూరు, నవాబుపేట, మడికి శివారు మల్లవానితోట, మూలస్థాన అగ్రహారం తదితర గ్రామాల్లో అనేక మంది చిన్నారులకు ఆరోగ్య, ఆశ, అంగన్‌వాడీ సిబ్బంది టీకాలు వేశారు.

కోవిడ్ నిబంధనలను అనుసరించి నిర్వహించిన ఈ టీకాల ప్రక్రియను సీహెచ్‌ఓ పి.రాధాకృష్ణ, హెచ్‌ఈ ఏవీవీ రాజా అక్కుల, సూపర్‌వైజర్లు పీవీ రమణారావు, ఎస్.వెంకటేశ్వర్లు, పి.ఉమ, సీహెచ్ బేబి పర్యవేక్షించారు. చిన్నారులకు ధనుర్వాతం, కామెర్లు, క్షయ, పోలియో, డిఫ్తీరియా, కోరింత దగ్గు నివారణకు పెంటా వాలెంట్, ఎంఆర్, టీటీ, డీపీటీ, హెపటైటిస్-బీ వ్యాక్సిన్లను అందజేశారు. ఎంఎల్‌హెచ్‌పీలు, ఆశ కార్యకర్తలు పాల్గొన్నారు.

జూనియర్ బ్యాడ్మింటన్ పోటీలు ప్రారంభం

అమలాపురం టౌన్: స్థానిక దుడ్డివారి అగ్రహారంలోని ఆఫీసర్స్ క్లబ్ ఇండోర్ కోర్టులో మండల స్థాయి జూనియర్ బ్యాడ్మింటన్ క్రీడా పోటీలను వాకర్స్ అంతర్జాతీయ మాజీ అధ్యక్షుడు డాక్టర్ పీఎస్ శర్మ ప్రారంభించారు. అమలాపురం వాకర్స్ హెల్త్ క్లబ్, ఆఫీసర్స్ రిక్రియేషన్ క్లబ్ సంయుక్త ఆధ్వర్యంలో రెండు రోజుల పాటు నిర్వహించే ఈ పోటీల్లో దాదాపు 120 మంది విద్యార్థులు పాల్గొంటున్నారని వాకర్స్ హెల్త్ క్లబ్ అధ్యక్షుడు యర్రమిల్లి సత్యనారాయణమూర్తి తెలిపారు. కార్యక్రమంలో వాకర్స్ క్లబ్ కార్యదర్శి రంకిరెడ్డి కాశీ విశ్వనాథ్, కోనసీమ షటిల్ బ్యాడ్మింటన్ అసోసియేషన్ ఉపాధ్యక్షుడు అల్లాడ శరత్‌బాబు, కోచ్ మాధవి, ఉపాధ్యాయురాలు రంకిరెడ్డి రంగమణి, నాణేల సేకరణకర్త పుత్సా కృష్ణకామేశ్వర్ తదితరులు పాల్గొన్నారు.



కొత్తపేటలో వైఎస్ విగ్రహానికి నివాళులర్పిస్తున్న అముడా చైర్మన్ డేవిడ్‌రాజు, ఎంపీపీ గంగాధరరావు, వీరభద్రరావు తదితరులు



మలికిపురంలో రాజశేఖరరెడ్డి విగ్రహానికి పూలమాలలు వేస్తున్న కేఎస్ఎన్ రాజు, రాపాక వెంకట్రామ్ తదితరులు



అంబాజీపేటలో వైఎస్సార్ విగ్రహం వద్ద నివాళులర్పిస్తున్న ఎంపీపీ వెంకటేశ్వరరావు, పార్టీ నాయకులు



సఖినేటిపల్లి మార్కెట్ యార్డు వద్ద వైఎస్సార్ విగ్రహానికి నివాళులర్పిస్తున్న ఎంపీపీ, చంద్రశేఖర్



నగరంలో రాజశేఖరరెడ్డి విగ్రహానికి నివాళులర్పిస్తున్న వైఎస్సార్ సీపీ శ్రేణులు

అభివృద్ధి ప్రదాత వైఎస్సార్

- క్లస్టర్ వ్యాప్తంగా వైఎస్సార్ వర్ధంతి
- నివాళులర్పించిన ఎమ్మెల్యే జగ్గిరెడ్డి, నాయకులు



రావులపాలెంలో వైఎస్సార్ సీపీ కార్యాలయం వద్ద వృద్ధులకు దుప్పట్లు పంపిణీ చేస్తున్న ఎమ్మెల్యే చిర్ల జగ్గిరెడ్డి



పి.గన్నవరంలో రాజశేఖరరెడ్డి విగ్రహానికి నివాళులర్పిస్తున్న జెడ్పీ చైర్మన్ విప్పర్తి వేణుగోపాలరావు

రావులపాలెం: ఉమ్మడి ఆంధ్రప్రదేశ్ రాష్ట్రానికి సంక్షేమాన్ని, అభివృద్ధిని ఏకకాలంలో చూపిన ఏకైక ముఖ్యమంత్రి స్వర్గీయ వైఎస్ రాజశేఖరరెడ్డి అని ప్రభుత్వ విప్, ఎమ్మెల్యే చిర్ల జగ్గిరెడ్డి అన్నారు. శనివారం మాజీ సీఎం వైఎస్ రాజశేఖరరెడ్డి వర్ధంతిని ప్రభుత్వ విప్, ఎమ్మెల్యే చిర్ల జగ్గిరెడ్డి ఆధ్వర్యంలో మండలంలోని వివిధ ప్రాంతాల్లో నిర్వహించి వైఎస్సార్‌కు నివాళులు అర్పించారు. రావులపాలెం మండలం గోపాలపురం సెంటర్, రావులపాలెం పోలీస్‌స్టేషన్ సెంటర్‌లో ఉన్న వైఎస్సార్ విగ్రహాలకు ఆయన వైఎస్సార్ సీపీ శ్రేణులతో కలసి పూలమాల వేసి నివాళులు అర్పించారు. అలాగే రావులపాలెం పార్టీ కార్యాలయం వద్ద జరిగిన కార్యక్రమంలో వైఎస్సార్ విగ్రహానికి పూలమాల వేసి నివాళులు అర్పించారు. అనంతరం వృద్ధులకు, వికలాంగులకు దుప్పట్లు, పండ్లు పంపిణీ చేశారు. అలాగే మండల పరిషత్ కార్యాలయం వద్ద జెడ్పీటీసీ కె.శ్రీనివాసరావు, మాజీ ఎంపీటీసీ కర్రి వీర్రెడ్డి, రావులపాలెం పంచాయతీ వద్ద సర్పంచ్ తాడేపల్లి నాగమణి, ఉపసర్పంచ్ గొలుగూరి మునిరెడ్డిలు వైఎస్సార్ విగ్రహాలకు, చిత్రపటాలకు నివాళులు అర్పించారు. కార్యక్రమంలో డీసీఎంఎస్ చైర్మన్ సాకా మణికుమారి, సర్పంచులు అంబటి సుబ్బలక్ష్మి, దొమ్మేటి అర్జునరావు, రాష్ట్ర శెట్టిబలిజ కార్పొరేషన్ డైరెక్టర్ బొక్కా వెంకటలక్ష్మి, మాజీ జెడ్పీటీసీ సాకా ప్రసన్నకుమార్ తదితరులు పాల్గొన్నారు.

అంబాజీపేట: ప్రజల కోసం నిరంతరం పరిశ్రమించిన గొప్ప నాయకుడు దివంగత నేత డాక్టర్ వైఎస్సార్ అని ఎంపీపీ దొమ్మేటి వెంకటేశ్వరరావు, బ్రాహ్మణ కార్పొరేషన్ డైరెక్టర్ పేరి శ్రీనివాస్, జిల్లా అధికార ప్రతినిధి పీకే రావు అన్నారు. అంబాజీపేట బస్టాండ్ ఎదురుగా పార్టీ మండల శాఖ ప్రధాన కార్యదర్శి నాగవరపు నాగరాజు ఆధ్వర్యంలో వైఎస్సార్ వర్ధంతి నిర్వహించారు. కార్యక్రమంలో వైస్ ఎంపీపీలు నేతల నాగరాజు, సూదాబత్తుల లక్ష్మీభార్గవి, సొసైటీ అధ్యక్షుడు బొంతు శ్రీనివాస్, కొర్లపాటి కోటబాబు, మైలా ఆనందరావు, కుసుమ శ్రీను, రాయుడు కృష్ణమహేష్, వెన్నపు రాంబాబు, చింతపల్లి వెంకటేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు. అలాగే పలు గ్రామాల్లో వైఎస్సార్ వర్ధంతి నిర్వహించారు.

మలికిపురం: మాజీ సీఎం వైఎస్సార్ జనం గుండెల్లో సుస్థిర స్థానం పొందారని వైఎస్సార్ సీపీ నాయకులు కేఎస్ఎన్ రాజు, రాపాక వెంకటరామ్‌లు పేర్కొన్నారు. శనివారం మలికిపురం మండల వ్యాప్తంగా మాజీ సీఎం వైఎస్సార్ వర్ధంతిని పార్టీ శ్రేణులు నిర్వహించారు. మలికిపురంలో రాపాక వెంకట్‌రామ్ కేఎస్ఎన్ రాజు వైఎస్సార్ విగ్రహానికి పూలమాల వేసి నివాళులర్పించారు. కార్యక్రమంలో స్థానిక సర్పంచ్ గెడ్డం రాజ్యలక్ష్మి, తులసీ భాస్కరరావు, గ్రామ శాఖ అధ్యక్షుడు కోళ్ల వేణుప్రసాద్, సొసైటీ చైర్మన్, ముప్పర్తి త్రిమూర్తులు, ఎంపీటీసీ కొప్పిశెట్టి సీతామహాలక్ష్మి, దొమ్మేటి ఉమ, రొక్కాల వెంకట్, గుబ్బల బాబ్జి, తాడి వర్మ తదితరులు పాల్గొన్నారు. అలాగే పలు గ్రామాల్లో వైఎస్సార్ వర్ధంతిని ఆయా గ్రామ నాయకుల ఆధ్వర్యాన నిర్వహించారు.

ఆలమూరు: దివంగత సీఎం వైఎస్సార్ వర్ధంతిని మండల వ్యాప్తంగా నిర్వహించారు. చెముడులంకలో సర్పంచ్, మండల కన్వీనర్ తమ్మన శ్రీనివాసు, చొప్పెల్లలో ఎంపీపీ తోరాటి లక్ష్మణరావు, జెడ్పీటీసీ తోరాటి సీతామహాలక్ష్మి, ఆలమూరులో రాష్ట్ర వైఎస్సార్‌సీపీ సేవాదళ్ సంయుక్త కార్యదర్శి చల్లా ప్రభాకరరావు, గ్రామ కమిటీ అధ్యక్షుడు రావాడ సత్తిబాబు, సర్పంచ్ నేలపూడి లావణ్య, మడికిలో ఏఎంసీ చైర్మన్ యనమదల నాగేశ్వరరావు ఆధ్వర్యంలో పార్టీశ్రేణులు వైఎస్సార్ వర్ధంతి నిర్వహించారు. అలాగే పలు గ్రామాల్లో వైఎస్సార్ విగ్రహాలకు పూలమాల వేసి నివాళులు అర్పించారు.

సఖినేటిపల్లి: అంతర్వేదిపాలెంలో దారుల్ ఉలుమ్ ఇక్రామియ ఎడ్యుకేషనల్ ట్రస్ట్ కార్యాలయం వద్ద రాజోలు వైఎస్సార్ సీపీ సోషల్ మీడియా ఆధ్వర్యంలో వైఎస్సార్ వర్ధంతి నిర్వహించారు. యువ నాయకుడు రాపాక వెంకట్‌రామ్, కేఎస్ఎన్ రాజు, పాటి శివకుమార్ డాక్టర్ వైఎస్సార్ చిత్రపటంకు పూలమాల వేసి నివాళులర్పించారు. పిల్లలకు మధ్యాహ్న భోజన వసతి కల్పించారు. పార్టీ మండల అధ్యక్షుడు కుసుమ చంద్రశేఖర్, వైస్ ఎంపీపీ రాపాక దీవెనకుమారి, డీసీఎంఎస్ డైరెక్టర్ అడబాల బ్రహ్మాజీ, నల్లి సుధీర్ తదితరులు పాల్గొన్నారు. మండల వ్యాప్తంగా పలు ప్రాంతాల్లో వైఎస్సార్ వర్ధంతి కార్యక్రమాలు వైఎస్సార్ సీపీ శ్రేణులు, అభిమానులు ఘనంగా నిర్వహించారు.

కొత్తపేట: దివంగత సీఎం వైఎస్సార్ తనదైన పాలనతో చరిత్రలో నిలిచిపోయారని అముడా చైర్మన్ గొల్లపల్లి డేవిడ్‌రాజు అన్నారు. పార్టీ మండల శాఖ అధ్యక్షుడు ముత్యాల వీరభద్రరావు ఆధ్వర్యంలో స్థానిక బస్టాండ్ సెంటర్‌లో రాజశేఖరరెడ్డి విగ్రహానికి డేవిడ్‌రాజు, ఎంపీపీ మార్గన గంగాధరరావు తదితరులు పూలమాల వేసి నివాళులర్పించారు. కార్యక్రమంలో ఎంపీటీసీలు విళ్ల వీర్రాజు, దూళి సూరిబాబు, మాజీ సభ్యుడు సాకా జానకిరామరాజు, మందపల్లి వీడీసీ కన్వీనర్ సాధు చెంచయ్య, గ్రామ శాఖల అధ్యక్షులు సలాది బ్రహ్మాజీ, గొల్లపల్లి శ్రీనివాసరావు, తులా సూర్యనారాయణ, కాకర సర్వేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.

పి.గన్నవరం: వైఎస్సార్ పేద ప్రజలకు అందించిన సేవలు చిరస్మరణీయమని జెడ్పీ చైర్మన్ విప్పర్తి వేణుగోపాలరావు అన్నారు. రాజశేఖరరెడ్డి వర్ధంతి సందర్భంగా స్థానిక అక్విడెక్టు పార్కులో ఆయన విగ్రహానికి విప్పర్తి పూలమాల వేసి నివాళులర్పించారు. అలాగే మండలశాఖ అధ్యక్షుడు నక్కా వెంకటేశ్వరరావు ఆధ్వర్యంలో వైఎస్సార్ విగ్రహానికి నివాళులర్పించారు. సర్పంచ్‌లు కొంబత్తుల ఏసు, వడలి కొండయ్య, పార్టీ నాయకులు అడ్డగళ్ల వెంకట సాయిరామ్, కడలి వెంకటరమణ, నాగాబత్తుల యువరాజు, అడ్డగళ్ల శ్రీను, కొక్కిరి రవికుమార్, దూనబోయిన రవిచంద్ర, నూకపెయ్యి రాజేంద్రప్రసాద్, పెచ్చెట్టి రాంబాబు పూలమాలలు వేసి, నివాళులు అర్పించారు.

మామిడికుదురు: వైఎస్సార్ చిరస్మరణీయుడని జెడ్పీటీసీ కొరెడ్డి అంజిబాబు, పార్టీ మండల శాఖ అధ్యక్షుడు కొమ్ముల రాము శ్లాఘించారు. రాజశేఖరరెడ్డి వర్ధంతి నిర్వహించారు. నగరం, మామిడికుదురు గ్రామాల్లో జాతీయ రహదారి పక్కన ఉన్న విగ్రహాలకు, పెదపట్నంలో రాజశేఖరరెడ్డి చిత్రపటానికి పార్టీ నేతలు పూలమాలలు వేసి నివాళులర్పించారు. అప్పనపల్లిలో కంకిపాటి సూర్యారావు, ఆదిలక్ష్మి కళా వేదికలో ఉన్న విగ్రహానికి వేదిక వ్యవస్థాపకులు కంకిపాటి వెంకటేశ్వరరావు పూలమాల వేసి నివాళులర్పించారు. ఆయా కార్యక్రమాల్లో పార్టీ నేతలు జక్కంపూడి వాసు, బొలిశెట్టి భగవాన్, కటకంశెట్టి ఆదిత్యకుమార్, సూరిశెట్టి బాబి, చిట్టూరి రామకృష్ణ, కుసుమ శ్రీధర్, సజ్జాద్ హుస్సేన్, అన్వర్ తాహిర్ హుస్సేన్, జాలెం అనూష, నెల్లి దుర్గాప్రసాద్ పాల్గొన్నారు.

అయినవిల్లి: మండలంలోని శానపల్లిలంకలో దివంగత మాజీ సీఎం వైఎస్సార్ వర్ధంతిని వైఎస్సార్ సీపీ గ్రామశాఖ అధ్యక్షుడు పితాని వెంకటేశ్వరరావు అధ్యక్షతన జరిగింది. జెడ్పీటీసీ గన్నవరపు శ్రీనివాసరావు, పార్టీ శ్రేణులు వైఎస్సార్ విగ్రహానికి పూలమాల వేసి నివాళులర్పించారు. ముక్తేశ్వరం సెంటర్‌లో రాజశేఖర్ రెడ్డి విగ్రహానికి పూలమాల వేసి నివాళులర్పించారు.

ఆత్రేయపురం: వైఎస్సార్ పాలన రాష్ట్ర చరిత్రలో సువర్ణాక్షరాలతో లిఖించదగినదని పలువురు వక్తలు కొనియాడారు. మహానేత వైఎస్ వర్ధంతిని మండలంలోని గ్రామగ్రామానా నిర్వహించారు. వైఎస్సార్ విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. పులిదిండిలో పార్టీ మండల కన్వీనర్ కనుమూరి శ్రీనివాసరాజు ఆధ్వర్యంలో వైఎస్ వర్ధంతి నిర్వహించారు.

పలు సేవా కార్యక్రమాల నిర్వహణ



పాశర్లపూడిలో పేదలకు నిత్యావసరాలు అందజేస్తున్న కొండలరావు

అంబాజీపేట/కొత్తపేట/మామిడికుదురు/అయినవిల్లి: జనసేన అధ్యక్షుడు పవన్‌కల్యాణ్ పుట్టినరోజు పురస్కరించుకుని అంబాజీపేటలో 20 మంది పేద విద్యార్థినులకు శనివారం సైకిళ్లు పంపిణీ చేశారు. స్థానిక కొర్లపాటివారిపాలెంలో ఉన్న సామాజిక భవనంలో పవన్‌కల్యాణ్ పుట్టినరోజు వేడుకలను పార్టీ మండల శాఖ అధ్యక్షుడు దొమ్మేటి సాయికృష్ణ, ఉభయగోదావరి జిల్లాల ఉపాధ్యక్షుడు శిరిగినీడి వెంకటేశ్వరరావు ఆధ్వర్యంలో జరిగింది. పేరాబత్తుల ధన మాధవరావు, ఓఎన్‌జీసీ ఫ్రెండ్స్ సర్కిల్ ధన సాయంతో పేద విద్యార్థులకు సైకిళ్లను అందించారు. కార్యక్రమంలో ఆ పార్టీ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు. అలాగే కొత్తపేటలో ఆ పార్టీ నియోజకవర్గ ఇన్‌చార్జ్ బి.శ్రీనివాసరావు ఆధ్వర్యంలో శనివారం వివిధ కార్యక్రమాలు నిర్వహించారు. కొత్తపేటలో పేదలకు దుప్పట్లు పంపిణీ చేశారు. మామిడికుదురు మండలం పాశర్లపూడిలో నగరం ఏఎంసీ మాజీ చైర్మన్ కొమ్ముల కొండలరావు పాఠశాల విద్యార్థులకు పుస్తకాలు, పెన్నులు పంచారు. కార్మికులకు అన్నదానం ఏర్పాటు చేశారు. పేదలకు నిత్యావసరాల కిట్లు పంపిణీ చేశారు. మొగలికుదురు ఆశ్రమంలో వృద్ధులకు, చిన్నారులకు పండ్లు పంచారు. ఆయా కార్యక్రమాల్లో మండల శాఖ అధ్యక్షుడు జాలెం శ్రీనివాసరాజు, సర్పంచ్‌ల సమాఖ్య అధ్యక్షుడు అడబాల తాతకాపు, పార్టీ నేతలు పాల్గొన్నారు. అయినవిల్లి మండలంలోని ముక్తేశ్వరం, అయినవిల్లి, వీరవల్లిపాలెం, విలస తదితర గ్రామాల్లో పవన్ జన్మదిన వేడుకలను ఘనంగా నిర్వహించారు. ముక్తేశ్వరంలో రక్తదాన శిబిరం ఏర్పాటు చేశారు.

వైభవంగా అమ్మవారి విగ్రహ పునఃప్రతిష్ఠ



విజయదుర్గాదేవిని దర్శించుకుంటున్న ప్రభుత్వ విప్ జగ్గిరెడ్డి తదితరులు

కొత్తపేట: స్థానిక బోడిపాలెం వంతెన వద్ద విజయదుర్గా అమ్మవారి విగ్రహ పునఃప్రతిష్ఠ, జీవ ధ్వజస్తంభ, లక్ష్మీదేవి శిలా విగ్రహ ప్రతిష్ఠ, బలిపీఠం, సింహవాహన సంపూర్ణ ప్రతిష్ఠ మహోత్సవ కార్యక్రమాలు వైభవంగా నిర్వహించారు. ఆలయ పునర్నిర్మాణ, విగ్రహాల పునః ప్రతిష్ఠాపన కమిటీ ఆధ్వర్యంలో గత రెండు రోజులుగా వివిధ పూజ, హోమాలు నిర్వహించారు. శనివారం ఉదయం 11.39 గంటలకు శతాధిక విగ్రహ ప్రతిష్ఠాపనాచార్య శ్రీమాన్ సుదర్శనం వెంకట జనార్దనాచార్యుల ఆధ్వర్యంలో పండితుల బృందం స్థానిక ప్రముఖులు బొరుసు వెంకటఉదయభాస్కర్, వసుధ దంపతులతో విజయదుర్గాదేవి శిలావిగ్రహ ప్రతిష్ఠ, భూసారపు సుబ్రహ్మణ్యం-రామలక్ష్మి దంపతులతో జీవ ధ్వజస్తంభం లక్ష్మీదేవి శిలావిగ్రహం, బలిపీఠం, సింహవాహన ప్రతిష్ఠ కార్యక్రమాలు జరిపించారు. స్థానిక అంతర్జాతీయ శిల్పి డి.రాజ్‌కుమార్‌వుడయార్ పూజల్లో పాల్గొన్నారు. అనంతరం భారీ ఎత్తున అన్నసమారాధన నిర్వహించారు. ఆలయ కమిటీ ఆహ్వానం మేరకు ఎమ్మెల్యే, ప్రభుత్వ విప్ చిర్ల జగ్గిరెడ్డి విజయదుర్గా అమ్మవారిని దర్శించుకుని ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఆలయ కమిటీ సభ్యులు జగ్గిరెడ్డిని శేష వస్త్రాలతో సత్కరించారు. ఆయన వెంట అముడా చైర్మన్ గొల్లపల్లి డేవిడ్‌రాజు, ఎంపీపీ మార్గన గంగాధరరావు, మండల పార్టీ అధ్యక్షుడు ముత్యాల వీరభద్రరావు, పీఏసీఎస్ పర్సన్ ఇన్‌చార్జ్ ముసునూరి వెంకటేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు. అలాగే పలు పార్టీల నాయకులు అమ్మవారిని దర్శించుకున్నారు.

వీవీ మెరకలో నా మట్టి.. నా దేశం

సఖినేటిపల్లి: మండల బీజేపీ అధ్యక్షుడు చెంపాటి శివరామకృష్ణంరాజు ఆధ్వర్యంలో శనివారం వీవీ మెరకలో నా మట్టి.. నా దేశం కార్యక్రమం ఆ పార్టీ శ్రేణులు నిర్వహించారు. ప్రతి ఇంటి నుంచి మట్టిని సేకరించి, స్థానిక పంచాయతీలో మొక్కలను వారు నాటారు. పార్టీ నియోజకవర్గ కన్వీనర్ అడబాల రాంబాబు, జిల్లా ప్రధాన కార్యదర్శి అడబాల సత్యనారాయణ మాట్లాడుతూ, అజాదీ కా అమృత్ మహోత్సవ్‌లో ప్రతి గ్రామం, ప్రతి ఇంటి నుంచి మట్టిని సేకరించి, మొక్కలు నాటి దేశ రాజధాని ఢిల్లీలో పవిత్ర అమృత వాటిక నిర్మాణంలో మట్టిని భాగస్వామం చేస్తారని వారు తెలిపారు. పార్టీ రాష్ట్ర కో ఆపరేటివ్ సెల్ డైరెక్టర్ మాలే శ్రీనివాస నగేష్, మండల పార్టీ ఉపాధ్యక్షుడు తిరుమల వెంకటేశ్వరరావు, జిల్లా కిసాన్‌మోర్చా ఉపాధ్యక్షుడు ఇందుకూరి అచ్యుత్ రామరాజు పాల్గొన్నారు.

రాజోలు: మండల బీజేపీ అధ్యక్షుడు పితాని శ్రీనివాసరావు ఆధ్వర్యంలో శనివారం వీవీమెరకలో నా మట్టి... నా దేశం కార్యక్రమం ఆ పార్టీ శ్రేణులు నిర్వహించారు. ప్రతి ఇంటి నుంచి మట్టిని సేకరించి, స్థానిక పంచాయతీలో మొక్కలను వారు నాటారు. జొన్నలగడ్డ గోపాలకృష్ణ, వడ్లమూడి ప్రకాష్, నిరంజన్‌రావు, ఇంటిపల్లి రామకృష్ణ, గుబ్బల రాంబాబు తదితరులు పాల్గొన్నారు.

ఎమ్మెల్యే ఆరోగ్యంగా ఉండాలని ప్రార్థనలు

అంబాజీపేట: హైదరాబాద్ ఆస్పత్రిలో చికిత్స పొందుతున్న ఎమ్మెల్యే కొండేటి చిట్టిబాబు త్వరగా కోలుకుని సంపూర్ణ ఆరోగ్యంగా ఉండాలని కోరుతూ చిరతపూడి లంకవారిపేటలో అపోస్తుల లైఫ్ చర్చి పాస్టర్ ఎల్.సీ యోనురాజు మందిరంలో శనివారం ప్రత్యేక ప్రార్థనలు చేశారు. వైఎస్సార్ క్రిస్టియన్ మైనార్టీ సెల్ అధ్యక్షుడు కుసుమ రత్నం ఆధ్వర్యంలో అస్వస్థతకు గురైన ఎమ్మెల్యే చిట్టిబాబు త్వరగా కోలుకుని ఎటువంటి ఇబ్బందులు లేకుండా ప్రజలతో మమేకమవ్వాలంటూ పాస్టర్లు ప్రార్థనలు నిర్వహించారు. ఈ ప్రార్థనలో సంఘస్తులు పాల్గొన్నారు.

ఎమ్మెల్యేకు మాజీ ఎంపీ పరామర్శ

మామిడికుదురు: అనారోగ్యంతో హైదరాబాద్ కిమ్స్ ఆస్పత్రిలో చికిత్స పొందుతున్న పి.గన్నవరం ఎమ్మెల్యే కొండేటి చిట్టిబాబును అమలాపురం మాజీ ఎంపీ జీవీ హర్షకుమార్ శనివారం పరామర్శించారు. చిట్టిబాబు ఆరోగ్య పరిస్థితిని అడిగి తెలుసుకున్నారు. పి.గన్నవరం నియోజకవర్గానికి చెందిన పార్టీ నేతలు కిమ్స్‌లో చికిత్స పొందుతున్న ఎమ్మెల్యే చిట్టిబాబును పరామర్శించారు.

పి.గన్నవరంలో..

పి.గన్నవరం: ఎమ్మెల్యే కొండేటి చిట్టిబాబు త్వరగా కోలుకుని, సంపూర్ణ ఆరోగ్యంతో తిరిగి రావాలని కోరుతూ స్థానిక షిర్డీ సాయిబాబా వారి ఆలయంలో వైఎస్సార్‌సీపీ శ్రేణులు శనివారం ప్రత్యేక పూజలు చేశారు. మండల శాఖ అధ్యక్షుడు నక్కా వెంకటేశ్వర రావు, సర్పంచ్‌లు కొంబత్తుల ఏసు, వడలి కొండయ్య, నాయకులు అడ్డగళ్ల వెంకట సాయిరామ్, కడలి వెంకట రమణ, నాగాబత్తుల యువరాజు, అడ్డగళ్ల శ్రీను, కొక్కిరి రవికుమార్, దూనబోయిన రవిచంద్ర, నందిబాబు, రాజేంద్ర ప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.

నేడు కళాపీఠం ఏర్పాటు

అంబాజీపేట: సాహిత్య కళారంగంలో నిష్ణాతులైన వారిని గుర్తించి కళాపీఠాన్ని ఏర్పాటు చేసేందుకు అంబాజీపేట బస్‌స్టేషన్ ఎదురుగా ఆదివారం ఉదయం సమావేశం నిర్వహించనున్నట్లు అరిగెల బలరామమూర్తి తెలిపారు. కళారంగంలో ఉన్నవారిని గుర్తించడంతో పాటు సన్మానించి అవార్డులను అందజేయనున్నామన్నారు. అనంతరం కళాపీఠం కమిటీని ఏర్పాటు చేస్తామన్నారు.

5న మండల సర్వసభ్య సమావేశం

పి.గన్నవరం: స్థానిక మండల పరిషత్ సమావేశంలో ఈనెల 5న మండల పరిషత్ సర్వసభ్య సమావేశం నిర్వహిస్తున్నట్టు ఎంపీడీఓ ఎం.భారతి తెలిపారు. ఎంపీపీ అంబటి భూలక్ష్మి అధ్యక్షతన జరగనున్న ఈ సమావేశంలో సర్పంచ్‌లు, ఎంపీటీసీలు, అన్ని శాఖల అధికారులు హాజరు కావాలని ఆమె విజ్ఞప్తి చేశారు.

9న జాతీయ లోక్ అదాలత్

కొత్తపేట: జాతీయ లోక్ అదాలత్ పురస్కరించుకుని జిల్లా న్యాయ సేవాధికార సంస్థ ఆదేశాల మేరకు ఈ నెల 9న స్థానిక కోర్టులో లోక్ అదాలత్ నిర్వహిస్తున్నట్టు సీనియర్ సివిల్ జడ్జి కె.శైలజ శనివారం ఒక ప్రకటనలో తెలిపారు. సివిల్, రాజీ పడదగిన క్రిమినల్ కేసుల కక్షిదారులు రాజీ చేసుకునేందుకు ఈ లోక్ అదాలత్‌ను సద్వినియోగం చేసుకోవాలని కోరారు.

12 నుంచి మండల స్థాయిలో ఎస్‌జీఎఫ్ పోటీలు

పి.గన్నవరం: స్కూల్ గేమ్స్ ఫెడరేషన్ సెలక్షన్స్‌లో భాగంగా స్థానిక జెడ్పీ ఉన్నత పాఠశాల ఆవరణలో ఈనెల 12 నుంచి మూడు రోజుల పాటు మండల స్థాయిలో విద్యార్థులకు తొమ్మిది విభాగాల్లో పోటీలు నిర్వహిస్తున్నట్టు ఎంఈఓలు కోన హెలీనా, చింతా వీరభద్రం తెలిపారు. స్థానిక జెడ్పీ ఉన్నత పాఠశాలలో శనివారం జరిగిన సమావేశంలో వారు మాట్లాడుతూ కబడ్డీ, ఖోఖో, వాలీబాల్, బాల్ బ్యాడ్మింటన్, షటిల్, త్రోబాల్, టెన్నికాయిట్ తదితర పోటీలు నిర్వహిస్తామన్నారు. మండల స్థాయిలో ప్రతిభ కనబరచిన క్రీడాకారులను నియోజకవర్గ స్థాయి పోటీలకు ఎంపిక చేస్తామన్నారు. సమావేశంలో మండల స్పోర్ట్స్ కోఆర్డినేటర్ కె.వెంకటరమణ, హెచ్ఎం ప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.

మాజీ ఎమ్మెల్యే వర్ధంతి

రాజోలు: మండలంలోని తాటిపాక సెంటర్లో శనివారం రాజోలు మాజీ ఎమ్మెల్యే మంగెన గంగయ్య వర్ధంతిని అభిమానులు ఘనంగా నిర్వహించారు. ఆయన విగ్రహానికి వారు పూలమాల వేసి నివాళులర్పించారు. పోతు కాశీ, కటికిరెడ్డి బుజ్జి, కె.వెంకటేశ్వరరావు, టి.నారాయణ, టి.నాగేశ్వరరావు, వై.సత్యనారాయణ, ఎన్.సత్తి అబ్బులు, కె.రమేష్ పాల్గొన్నారు.

అకడమిక్ క్యాలెండర్ ఆవిష్కరణ

రాజోలు: మండల స్థాయిలో 2023-24 విద్యా సంవత్సరానికి గాను శనివారం అకడమిక్ క్యాలెండర్‌ను ఎంఈఓ నల్లి మనోహరం ఆవిష్కరించారు. పాఠశాలల్లో నెలలు వారీగా ఏయే నెలల్లో విద్యార్థులకు ఏయే పాఠాలు చెప్పాలో, వర్క్ బుక్స్‌లో ఏ నెలల్లో ఏయే చర్యలు తీసుకోవాలో వివరించామన్నారు.

కోనసీమలో కొబ్బరికి పూర్వ వైభవం



నారాయణలంకలో కొబ్బరి చెట్టుకు పూజలు నిర్వహిస్తున్న శాస్త్రవేత్తలు గోవర్ధన్, కిరీటి

కొత్తపేట: కోనసీమలో కొబ్బరికి పూర్వ వైభవం తీసుకువచ్చే దిశగా శాస్త్రీయ కృషి జరుగుతుందని అంబాజీపేట డాక్టర్ వైఎస్సార్ ఉద్యాన పరిశోధన స్థానం శాస్త్రవేత్త డాక్టర్ వి.గోవర్ధనరావు అన్నారు. ప్రపంచ కొబ్బరి దినోత్సవాన్ని పురస్కరించుకుని శనివారం కొత్తపేట మండలం వానపల్లి శివారు నారాయణలంకలో వివిధ కార్యక్రమాలు ఘనంగా నిర్వహించారు. స్థానిక ఉద్యాన శాఖాధికారి డాక్టర్ జి.కోటేశ్వరరావు ఆధ్వర్యంలో జరిగిన కార్యక్రమంలో కొబ్బరి తెగుళ్ల నివారణ శాస్త్రవేత్తలు డాక్టర్ గోవర్ధన్‌రావు, కిరీటి ముఖ్యఅతిథులుగా పాల్గొని కల్పవృక్షంగా భావించే కొబ్బరి చెట్టుకు పసుపు, కుంకుమ, పువ్వులు వేసి, కొబ్బరికాయలు కొట్టి దండలు వేశారు. కొబ్బరి రైతుల అవగాహన సదస్సులో డాక్టర్ గోవర్ధన్ మాట్లాడుతూ కొబ్బరి సాగులో విస్తీర్ణ పరంగా నాలుగో స్థానంలో ఉన్న ఏపీ ఉత్పాదకతలో మాత్రం ముందంజలో ఉందన్నారు. 2015 నాటి కొబ్బరి లెక్కలు ప్రకారం హెక్టార్‌కు సగటున ఏడాదికి ఉత్పత్తి చేసే కాయలు లెక్కగడితే కేరళలో 7,486, కర్నాటకలో 9,745, తమిళనాడులో 14,872 ఉండగా ఏపీలో మాత్రం 14,997 గా ఉన్నాయన్నారు. అప్పట్లో 184.4 కోట్ల కొబ్బరి కాయల ఉత్పత్తి జరగ్గా మొత్తం దేశీయ ఉత్పత్తిలో ఏపీ వాటా 8.44 శాతంగా ఉందన్నారు. అత్యధిక విస్తీర్ణంతో కొబ్బరి పంట కోనసీమ ప్రాంతానికి ప్రత్యేక గుర్తింపు తీసుకువచ్చిందన్నారు. అయితే 1996లో వచ్చిన పెను తుఫాను కోనసీమ కొబ్బరిపై పెను ప్రభావం చూపిందన్నారు. అప్పట్లో అత్యధికంగా కొబ్బరి చెట్లు నేలకొరగడంతో పాటు తరువాత వివిధ తెగుళ్లు వ్యాపించాయన్నారు. వాటిని నివారిస్తూ మేలైన కొబ్బరి ఉత్పత్తులకు చర్యలు తీసుకుంటున్నట్టు తెలిపారు. మరో వైపు కొబ్బరి తోటల పెంచడానికి ప్రభుత్వం వివిధ ప్రోత్సాహక పథకాలు అమలు చేస్తున్నట్టు తెలిపారు. ఇంకా కొబ్బరి యాజమాన్య పద్ధతులు, కొబ్బరిపై వ్యాపించిన తెల్లదోమ నివారణ, బదనికలు ఉపయోగం, మొవ్వకుళ్లు తెగులు నివారణ, కోకోనట్ ఐడీఎం స్పెషల్ అనే ఉత్పాదన ఉపయోగం, అధిక దిగుబడులు, ఆదాయం తదితర అంశాలపై రైతులకు అవగాహన కల్పించారు. కార్యక్రమంలో మండల ఏఏబీ చైర్మన్ పెదపూడి శ్రీనివాస్, రైతు సంఘం అధ్యక్షుడు పెదపూడి బాపిరాజు, బీహెచ్‌ఏలు ప్రీతిమానిక, ధనరాజు, సోనాలిక తదితరులు పాల్గొన్నారు.

అంబాజీపేటలో..

అంబాజీపేట: సంక్షోభంలో ఉన్న కొబ్బరి రైతులు అదనపు ఆదాయం పొందేందుకు కొబ్బరి విలువ ఆధారిత ఉత్పత్తులపై దృష్టి సారించాలని డాక్టర్ వైఎస్సార్ ఉద్యాన పరిశోధన కేంద్రం శాస్త్రవేత్తలు కిరిటీ, అనూషలు అన్నారు. ప్రపంచ కొబ్బరి దినోత్సవం సందర్భంగా అంబాజీపేట కొబ్బరి పరిశోధన కేంద్రంలో కొబ్బరి చెట్టుకు ప్రత్యేక పూజలు చేశారు.